క్లుప్తంగా

నిత్యావసర సరకుల అందజేత



బాధితుడికి సరకులు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన పరపటి మురళీ ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ యూత్ ప్రెసిడెంట్ ధర్మరెడ్డి శ్రీను తన సొంత నిధులతో నిత్యావసర సరకులతో పాటు కొంత నగదు సమకూర్చారు. వాటిని బుధవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు చేతులమీదుగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో దుర్గానగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదగంట్యాడ: గాజువాకలోని ప్రభుత్వ ఐటీఐ స్టీల్‌సిటీలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 10వ తరగతిలో జీపీఏ ఆధారంగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 10వ తరగతిలో జీపీఏ 10 నుంచి 7 వరకు 3వ తేదీన, జీపీఏ 6 నుంచి చివరి వరకు 4వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ ఫారం, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుపై దరఖాస్తు చేసిన అభ్యర్థులు 3వ తేదీ ఉదయం 9 గంటలకు వారి ఆర్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

ఏఐటీయూసీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: ఈ నెల 12,13 తేదీల్లో నగరంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభలను విజయవంతం చేయాలని స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎస్.ఎన్. రావు, డి.ఆదినారాయణ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నర్సింగరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.76వేల జరిమానా

సింహాచలం: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మంది వాహనదారులను బుధవారం కోర్టులో ప్రవేశపెట్టగా వారికి మెజిస్ట్రేట్ రూ.76 వేలు జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. చినముషిడివాడ, నాయుడుతోట, వేపగుంట, నరవ తదితర ముఖ్య కూడళ్లలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 25 మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్‌ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెం దరి రాజీవ్‌నగర్‌కు చెందిన చింతా చంద్రశేఖరరావు (50) ఫార్మా కంపెనీలో పని చేస్తున్నారు. బుధవారం పని మీద గాజువాక వచ్చిన ఆయన పాతగాజువాక నుంచి షీలానగర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో, పాతగాజువాక జంక్షన్‌లో ఆయన వాహనాన్ని వెనుక నుంచి ఖాళీ ట్రాలీ వ్యాను ఢీ కొట్టింది. అదుపు తప్పిన చంద్రశేఖరరావు కుడి తొడ వ్యాను చక్రం కింద పడి విరిగిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాద వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

మానసిక ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారా.. బయటకు చెప్పుకోలేక మీలో మీరు మదన పడుతున్నారా.. మీ సమస్యను నేరుగా వైద్యునికి తెలియజేయాలని ఉందా?.. ఇంకెందుకు ఆలస్యం వెంటనే 0891-3100189, 0891-3100048 నంబర్లకు ఫోన్ చేయండి. సుశిక్షితులైన వైద్యులు మీ సమస్యకు తగిన సూచనలు, సలహాలు, అవసరమైన చికిత్స అందిస్తారు.

మానసిక సమస్యా.. మదనపడొద్దు



టెలిమానస్ కేంద్రంలో సేవలు అందిస్తున్న వైద్యులు

- ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో టెలిమానస్ సేవలు ప్రారంభం
- బాధితులకు ఫోన్‌లో కౌన్సెలింగ్
- ఆత్మహత్యల నివారణే లక్ష్యం

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో టెలి మానస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బుధవారం నుంచి ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నలుగురు వైద్యులు ఫోన్‌లో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన కౌన్సెలింగ్ సేవలు అందించే వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. మానసిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆచార్య పి.లోకేశ్వరరెడ్డి, డి.విజయలక్ష్మి, డి.సురేష్‌కుమార్ ఈ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రస్తుతం టెలిమెడిసిన్ బాగా ప్రాచుర్యం పొందింది. ఇదే తరహాలో టెలి మానస్ సైతం నిలుస్తుంది. ఈ సందర్భంగా టెలి మానస్ పనిచేసే విధానాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామరెడ్డి వివరించారు.

బాధితులకు వరం

మానసిక సమస్యలు ఉన్నవారు త్వరగా వైద్యుల వద్దకు రావడానికి ఇష్టపడరు. తమ సమస్యలను ఇతరులతో పంచుకోవడానికి ఆసక్తి చూపరు. తమలో తాము మదన పడుతూ, మానసికంగా మరింత కుంగుబాటుకు లోనవుతారు. దీనికి పరిష్కారం చూపే విధంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న టెలి మానస్ నిలుస్తుంది. ఇందు కోసం ఆస్పత్రి మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ నాలుగు ఫోన్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం నలుగురు వైద్యులు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదివారం మినహా వారంలో ఆరు రోజులు ఇక్కడ ఫోన్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారు.

మనోస్థైర్యం నింపి.. ఆత్మహత్యల నివారణ

ఇటీవల కాలంలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్ కారణంగా క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇటువంటి వారికి మనోస్థైర్యాన్ని నింపి, ఆత్మహత్య నివారించే విధంగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది. ఎటువంటి మానసిక సమస్యలు ఉన్నవారైనా స్వేచ్ఛగా ఇక్కడికి ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా వైద్యులకు చెప్పుకునే అవకాశం ఉంది. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. ముందుగా రోగి ఆరోగ్య పరిస్థితి, మానసిక ఆరోగ్యం ఎలా ఉంది అనే వివరాలు తెలుసుకుంటారు. వీటిని ఆధారంగా చేసుకుని ఫోన్‌లో రోగికి అవసరమైన మానసిక ధైర్యాన్ని అందించి, చికిత్సకు వచ్చే విధంగా సిద్ధం చేస్తారు. అవసరమైతేనే రోగిని ఆస్పత్రికి రావాలని సూచించి, వారికి అవసరమైన సంపూర్ణ చికిత్స అందిస్తారు.



టెలి మానస్ కేంద్రం ప్రారంభిస్తున్న ఆచార్య లోకేశ్వర్‌రెడ్డి

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



అందుబాటులో ఉన్న వనరులు, వసతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తు న్నాం. మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నవారు నేరు గా ఆయా నంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యను చెప్పుకోవచ్చు. సుశిక్షితులైన వైద్యులే స్వయంగా ఫోన్‌లో అందుబాటులో ఉండటంతో నేరుగా రోగి తన సమస్యను చెప్పుకునే అవకాశం ఉంది. నేరుగా వైద్యుని వద్దకు వెళ్లకుండా అవసరమైన కౌన్సెలింగ్ లభిస్తుంది.

– డాక్టర్ కె.వి.రామిరెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

బాబోయ్ విమాన్ నగర్!





గోతుల్లో కూరుకుపోయిన వాహనాలు

- గోతుల్లో కూరుకుపోతున్న వాహనాలు
- బయటకు తీయడానికి అవస్థలు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి. పైప్‌లైన్ కోసం తవ్విన గోతులు మట్టితో పూడ్చి వదిలేశారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గొయ్యలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ లైన్‌లో రాకపోకలు సాగించే పలు వాహనాలు గుంతల్లో కూరుకు పోయి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల జీవీఎంసీ చెత్త తరలించే వాహనం, స్కూల్‌బస్సు కూరుకు పోయాయి. దీంతో మరో లారీని తీసుకు వచ్చి వాటిని బయటకు లాగారు. ఇదే విధంగా ప్రతీ రోజూ ఏదో ఒక వాహనం కూరుకుపోతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గోతులను పూర్తి స్థాయిలో పూడ్చాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఆడారి ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు పార్టీ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అజంతా పార్క్‌లో కమ్యూనిటీ హాలు, కంపరపాలెంలో 40 సెంట్ల స్థలంలో పార్క్ అభివృద్ధి అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీబీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు, 91వ వార్డులో రహదారులు, కాల్వల పరిస్థితిని వివరించారు. వెంకటాపురం శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయించి ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. ఆయనతో పాటు 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గొంతిన నాగరాజు, కంపర సత్తిబాబు, నీలాపు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు

సీతంపేట: శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని తన ఇంటి వద్ద బుధవారం ఉదయం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో సుమారు నాలుగున్నర లక్షల మంది శెట్టి బలిజలు ఉన్నారని, వారందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులు, ఉన్నత హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వైద్యాధికారులు కడలి సత్యవరప్రసాద్, కముజు నరసింహరెడ్డి, యాండ్ర రాంప్రసాద్, యాండ్ర లక్ష్మీ నరసింగరావు, చెల్లుబోయిన మంగ వెంకట్‌లను సత్కరిస్తామన్నారు. నగరంలోని శెట్టి బలిజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కడలి సుబ్బారావు, కేతా గంగరాజు, కడలి శివ కేశవ నరసింహారావు, వాసర్ల బాలకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, నరాల బాలకృష్ణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాజశేఖర్, కట్టా శ్రీకాంత్, మామిడిశెట్టి రామకృష్ణమూర్తి, రాయుడు శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెంచ్ భాషా వారోత్సవాలు



విద్యార్థినులతో ముఖ్య అతిథి మేరీ ఏంజిల్ బసేస్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఫ్రెంచ్ జాతీయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఫ్రెంచ్ భాష ఆచార్య సిస్టర్ జైస్ నేతృత్వంలో ఫ్రెంచ్ గీతాలాపన, అభినయం, నృత్యాలు, సంస్కృతి పట్ల అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తమ కళాశాల ప్రారంభం నుంచి ఫ్రెంచ్‌ను ద్వితీయ భాషగా నేర్పిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. ముఖ్య అతిథిగా మేరీ ఏంజిల్ బసేస్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఫ్రెంచ్ భాష గొప్పదనాన్ని వివరించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంతో పాటు మేధో వికాసం పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి



మంచినీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రామ్మోహనరెడ్డి నాయకులు

సింధియా: జీవీఎంసీ 63వ కాకరలోవలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పాడైన పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, నాయకులు యలగాడ రాజు, కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పూర్ణిమ ఔదార్యం



కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జ్ఞానాపురం మాన్యువల్ స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొలగాని చిన్నారావు మంగళవారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ మంగళవారం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు చిన్నారావు కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేటట్లు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి మోహన్, కమల్‌కుమార్, పిల్లి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలపై మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సీఎం జగన్ పరిపాలిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 56వ వార్డు ఊర్వశికూడలి మళ్లసూరివీధి సచివాలయం 266 గోకుల్‌నగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఆనంద్ మాట్లాడారు. ఈ సందర్భంగా సురక్ష లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మహిళా నాయకులు జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్'

9న నిరసనలు



దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కో–కన్వీనర్ అయోధ్యరామ్ విమర్శించారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో ఈనెల 9వ తేదీన జరగనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 902వ రోజు సంస్థలోని సింటర్‌ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతతో బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు వై.టి.దాస్, విల్లా రామ్మోహనకుమార్, వరసాల శ్రీనివాసరావు, రమణరావు, ఏ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజా భాగస్వామ్యం అవసరం

- జెడ్సీ సింహాచలం
- విశాఖ డెయిరీలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి



డెయిరీలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలో 23వ స్థానంలో ఉన్న విశాఖ నగరం ఇప్పుడు 4వ స్థానంలో నిలిచిందని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. విశాఖ డెయిరీలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు జీవీఎంసీ అధికారులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. విశాఖ డెయిరీ జీఎం వెంకట్ మాట్లాడుతూ డెయిరీలో ప్లాస్టిక్ నిరోధానికి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రవేశపెట్టామని తెలిపారు. కొన్ని డెయిరీ పార్లర్లలో కేజీ పాల కవర్లకు అరలీటర్ పాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో లూజ్ పాలను ట్యాంకర్ల ద్వారా కొన్ని పాయింట్లలో విక్రయించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ నిరోధానికి తీసుకోవల్సిన చర్యలపై కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు, డెయిరీ ఉద్యోగులకు ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వడ్డాది శ్రీనివాసరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు కె.అప్పలరాజు, ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి వెంకయ్యకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని 85వ వార్డు పెదమడక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి, విద్యార్థులకు కేక్, స్వీట్లు పంచారు. విద్యార్థులతో జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ చైర్మన్ మోటూరి రమణ మాట్లాడుతూ భారతీయులు సగౌరవంగా తలెత్తుకుని సెల్యూట్ చేసేలా పతాకాన్ని రూపొందించిన వెంకయ్య మన తెలుగు వారు కావడంతో తెలుగుజాతి గర్వించదగిన విషయం అన్నారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బళ్ల పైడిరాజు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్సులు చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రవి

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల ప్రత్యేక అలవెన్సులపై యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సింటర్ ప్లాంట్ విభాగాధిపతి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు చెల్లించాల్సిన ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్‌లను కాంట్రాక్టర్లు నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అంశంపై యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన కాంట్రాక్టర్లు కార్మికులకు చెల్లింపులు నిలిపి వేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, జి. శ్రీనివాస్ (సిటూ), పి.వి. రమణమూర్తి (ఇంటక్), సత్యారావు (హెచ్ఎంఎస్), సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగిరెడ్డిని కలిసిన పోర్టు కార్మికులు

యాజమాన్యంతో చర్చలకు వినతి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 30 రోజులుగా నిరసనలు చేస్తున్నా అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కార్మికులంతా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని బుధవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యను ఏకరువు పెట్టారు. యాజమాన్యంతో చర్చలు జరపాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఇప్పటికే టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో పాటు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సమస్యను వివరించామన్నారు. కార్మికులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, మాద అప్పారావు, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, సత్యానందం తదితరులున్నారు.